క్లుప్తంగా

ఆలయానికి ఎల్‌ఈడీ టీవీ వితరణ



మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానానికి ప్రకాశం జిల్లా చీరాలకు చెందిన చాట్రాసి రాజేష్, స్వాతి దంపతులు ఎల్‌ఈడీ 55 ఇంచెస్ టీవీ మంగళవారం అందజేశారు. స్వామివారిపై భక్తితో ఆషాఢ ఆడికృత్తిక (స్వామివారి జన్మనక్షత్రం) సందర్భంగా ఈ టీవీ ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణకు అందించినట్లు దాతలు తెలిపారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. దాతలను ఆలయ మర్యాదలతో ఆలయం తరపున సత్కరించారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి

పెడన: పట్టణంలోని లే ఆవుట్లలో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని, అందుకు లబ్ధిదారులను చైతన్యం చేయాల్సి ఉందని హౌసింగ్ డీఈ బి.బుచ్చిబాబు అన్నారు. మంగళవారం ఆయన మున్సిపల్ కమిషనర్ బి.వెంకటరామయ్యతో కలిసి కమిషనర్ చాంబర్‌లో వార్డు ఎమినిటీలతో పట్టణ హౌసింగ్‌పై సమీక్షించారు. పల్లోటి-1, పల్లోటి-2, పైడమ్మ లే ఆవుట్‌లో అసంపూర్తిగా పునాదుల స్థాయిలో నిలిచిన ఇళ్లకు సంబంధించి బిల్లులు మంజూరవుతున్నాయని, తక్షణం ఇంటి పనులు ప్రారంభించేలా లబ్ధిదారులను చైతన్యం చేయాలన్నారు. మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య మాట్లాడుతూ బిల్లులు పెండింగ్ లేకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో హౌసింగ్ టౌన్ ఏఈ వై.సత్యనారాయణ, వార్డు ఎమినిటీలు పాల్గొన్నారు.

దైవ సేవకుడు సత్యనారాయణ మృతి



మచిలీపట్నంటౌన్: బెరాకా ప్రార్థనా మందిరం వ్యవస్థాపకుడు దైవ సేవకుడు బ్రదర్ బి.సత్యనారాయణ (79) మంగళవారం మృతి చెందారు. అనారోగ్య సమస్యలతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారు. ఈయనకు భార్య భారతి, కుమారుడు కిరణ్‌పాల్, కుమార్తె బ్యూలా ఉన్నారు. అంధుడైనప్పటికీ బైబిల్ వాక్యోపదేశంతో ఎంతో మందిని ప్రేరేపించారు. అనేక గ్రామాల్లో బెరాకా ప్రార్థనా మందిరాలు నిర్మించి సేవ అందిస్తున్నారు. బెరాకా సంస్థ ద్వారా ఎంతో మంది పేద విద్యార్థులకు, రోగులకు ఆర్థిక సాయం అందించారు. పేదల నివాస గృహాల నిర్మాణానికి సిమెంటు, ఐరన్, రేకులు సామగ్రిని అందించారు. సత్యనారాయణ మృతదేహం బుధవారం ఉదయం 11గంటలకు జిల్లా కోర్టు సెంటరులోని బెరాకా చర్చి వద్ద ప్రజల సందర్శనార్థం ఉంచనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గురువారం మధ్యాహ్నం అంతిమయాత్ర జరుగుతుందని తెలిపారు. ఆయన మృతికి పలువురు రాజకీయ ప్రముఖులు, నగర ప్రముఖులు, దైవసేవకులు, సంఘస్తులు సంతాపం తెలిపారు.

వ్యాపారవేత్త రమణయ్య మృతి




కోడూరు: ప్రముఖ వ్యాపారవేత్త, ఆర్యవైశ్య ప్రముఖుడు మద్దాళి రమణయ్య (85) అనారోగ్యంతో మృతి చెందారు. రమణయ్య వృద్ధాప్యంతో పాటు అనారోగ్య సమస్యలతో బాధపడుతూ విజయవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. సోమవారం అర్ధరాత్రి రమణయ్య మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రమణయ్య కుమారుడు మద్దాళి ప్రసాద్ ప్రస్తుతం కోడూరు మండల కిరణా వర్తక సంఘం, వాసవీ కపుల్స్ క్లబ్ రాష్ట్ర ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారు. రమణయ్య మృతికి మంగళవారం కోడూరులోని దుకాణాలను మూసివేసి సంతాపం తెలిపారు.

50 మద్యం సీసాలు స్వాధీనం

కోడూరు: అక్రమంగా తరలిస్తున్న మద్యం సీసాలను కోడూరు పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. కోడూరులోని ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి భారీ మొత్తంలో మద్యం తీసుకువెళ్తున్నారనే సమాచారంతో నరసింహపురం రోడ్డులో తనిఖీ చేసినట్లు ఎస్‌ఐ శిరీష తెలిపారు. తనిఖీల్లో కోడూరుకు చెందిన ఓ వ్యక్తి దగ్గర 50 మద్యం సీసాలు ఉన్నట్లు గుర్తించి, వాటిని స్వాధీనం చేసుకున్న ట్లు చెప్పారు. వ్యక్తిపై కేసు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. మద్యం అక్రమ రవాణాకు పాల్పడినా, బెల్టు షాపు లు నిర్వహించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యార్థుల ప్రదర్శన



మోపిదేవి: స్థానిక ఆశ్రమ పాఠశాల ఆవరణలో సోమవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంఈవో దుర్గా సాగర్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ప్రోత్సహించేందుకు జిల్లాలో 100 పాఠశాలలను ఎంపిక చేసినట్లు తెలిపారు. సూర్య మండలం వలే గీసి వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు, సహకారంతో రకరకాల విత్తనాలు, మొక్కలు అందులో నాటినట్లు తెలిపారు. విద్యార్థులు తమ ఇంటి పెరట్లోకూడా కూరగాయల విత్తనాలు నాటుకోవాలని సూచించారు.

కూర‘గాయాలు’

- బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయాలు
- బెంబేలెత్తిపోతున్న వినియోగదారులు
- ధరల నియంత్రణపై దృష్టిపెట్టని అధికారులు



మచిలీపట్నంటౌన్: రోజు రోజుకీ పెరుగుతున్న కూరగాయల ధరలు వినియోగదారులను గాయపరుస్తున్నాయి. ఇటీవల కాలంలో కూరగాయల ధరలకు రెక్కలు రావటంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పట్టుమని కిలో కూరగాయలు కొని కడుపారా భోజనం చేసే పరిస్థితులు లేకపోవటంతో అరకొర కూరతోనే సరిపెట్టుకుంటున్న పరిస్థితులు నెలకొన్నాయి. మరికొంత మంది పేదలు పచ్చడి మెతుకులతో సరిపుచ్చుకుంటున్నారు.

రైతు బజార్లో కూడా..

స్థానిక రైతుబజారులో కూరగాయల ధరలు కొద్ది రోజులుగా అధికంగా ఉంటున్నాయి. సాధారణంగా బహిరంగ మార్కెట్‌లో కంటే రైతుబజారులో తక్కువ ధరలకు కూరగాయలు లభిస్తాయి. అయితే ఇటీవల కాలంలో ఇక్కడ కూడా అధిక ధరలకు లభిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలతో కూరగాయలు, ఆకుకూరల పంటలు దెబ్బతినటంతో దిగుబడి తగ్గి ధరలు పెరిగాయంటున్నారు. దీంతో ప్రజలు కూరగాయలు కొనాలంటే బెంబేలెత్తిపోతున్నారు.

ఇక బహిరంగ మార్కెట్లో..

ఇక బహిరంగ మార్కెట్‌లో అయితే కూరగాయల ధరలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. ధరలు పెరగక మునుపు రూ.200, 300 లకు వారానికి సరిపడా కూరగాయలు కొనుగోలు చేసే వారమని ప్రస్తుతం రూ.500 నుంచి రూ.600 వంతున ఖర్చు చేయనిదే వారానికి సరిపడా కూరగాయలు రాని పరిస్థితి ఉందని వినియోగదారులు వాపోతున్నారు. రైతు బజారులో మంగళవారం కిలో టమాటా ధర రూ.36 ఉండగా బహిరంగ మార్కెట్‌లో రూ.80 ధర పలుకుతోంది. కిలో మిర్చి రూ.50, కాకరకాయ, క్యారెట్, బీర, బంగాళాదుంపలు, అలసంద వంటి కూరగాయలు కిలో రూ.40 విక్రయిస్తున్నారు. దొండ, గోరుచిక్కుడు, చామదుంప, బీట్‌రూట్ వంటి కూరగాయలు రూ.30 పైన విక్రయిస్తున్నారు. ఇదిలా ఉండగా బహిరంగ మార్కెట్‌లో ఈ కూరగాయల ధరలు రెట్టింపునకు విక్రయిస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో లభించే కూరగాయలు కూడా ఉదయమే రైతుబజారుకు వ్యాపారులు వచ్చి కొనుగోలు చేసినవే కావటం విశేషం. మిర్చి, కొత్తిమీర, ఆకుకూరల ధరలు కూడా అధిక ధరలకు విక్రయిస్తున్నారు.

రాయితీ కందిపప్పు, బియ్యం రాంరాం..

కందిపప్పు, బియ్యం ధరలు బహిరంగ మార్కెట్‌లో అధికంగా ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వం రాయితీకి వీటిని అందించే దుకాణాన్ని రైతుబజారులో ఏర్పాటు చేశారు. ఈ దుకాణాన్ని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, జేసీ గీతాంజలిశర్మ కొద్ది రోజుల క్రితం ప్రారంభించారు. ఈ దుకాణంలో బీపీటీ, సోనామసూరి, రా రైస్ కిలో రూ.48లకు, స్టీమ్డ్ రైస్ కిలో రూ.49, దేశవాళీ కందిపప్పు కిలో రూ.160లకు కొద్ది రోజులు మాత్రమే అందించారు. ఆ తర్వాత సాకులు మొదలు పెట్టారు నిర్వాహకులు. సరుకు రాలేదని, ప్యాకింగ్ చేయలేదని వినియోగదారులను మభ్యపెట్టడం మొదలు పెట్టి విక్రయాలు తగ్గించేశారు. వీటిమీద పర్యవేక్షణ లేని కారణంగా రాయితీ సరుకులు అందరికీ అందని పరిస్థితి వచ్చింది. అధిక ధరలపై అధికారులు దృష్టి పెట్టాలని, సామాన్యులను ఆదుకోవాలని కోరుతున్నారు.

350 మందికి వైద్య పరీక్షలు



క్యాన్సర్ స్క్రీనింగ్ బస్‌లో లాబ్ పరీక్షలను ప్రారంభించిన ఎమ్మెల్యే మండలి

నాగాయలంక: ఇంటింటికీ క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమాన్ని ప్రభుత్వం ఆగస్టు 15 నుంచి చేపట్టబోతున్నట్లు అవనిగడ్డ జనసేన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ వెల్లడించారు. స్థానిక సుదర్శి మానవతా సేవాసంస్థ ఆధ్వర్యంలో విజయవాడ మణిపాల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సహకారంతో మంగళవారం నాగాయలంక శ్రీకన్యకాపరమేశ్వరీ కల్యాణ మండపంలో నిర్వహించిన క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధులపై అవగాహన, నిర్ధారణ శిబిరాన్ని ముఖ్యఅతిథిగా ప్రారంభించారు. సంస్థ నిర్వాహకులు తలశిల రఘుశేఖర్, కనిగంటి నారాయణలను ఎమ్మెల్యే అభినందించారు. ఈ శిబిరంలో ఆసుపత్రికి చెందిన క్యాన్సర్ స్క్రీనింగ్ బస్ లాబ్‌లో 100కు పైగా రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ పరీక్షలను ఉచితంగా చేశారు. గుండె వ్యాధి నిర్ధారణ కోసం 250 మందికి ఎకో ఈసీజీ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. తహ సీల్దార్ ఎం.హరనాథ్, ఆసుపత్రి క్యాంప్ ఇన్‌చార్జి అబ్దుల్ జిలాని, ఉపసర్పంచి తలశిల నాని, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత, ఏఎంసీ మాజీ చైర్మన్ మండవ బాలవర్ధిరావు, అవనిగడ్డ జనసేన నేత గుడివాక శేషుబాబు, వర్రె రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రసన్నాంజనేయుడికి కూరగాయలతో అలంకరణ



మచిలీపట్నంటౌన్: స్థానిక ఈడేపల్లిలోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో స్వామివారిని మంగళవారం కూరగాయలతోఅత్యంత ఆకర్షణీయంగా అలంకరించారు. చిలకమర్రి శేషాచార్యులు (అప్పాజీ) ఈ అలంకారానికి సహకరించారు. మంగళవారం కావటంతో స్వామివారిని భక్తులు పెద్దఎత్తున దర్శించుకుని పూజించారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు అందజేశారు.

దౌర్జన్యం చేశారని ‘మీ కోసం’లో సర్పంచి ఫిర్యాదు

కృత్తివెన్ను: మండలంలోని చినపాండ్రాక గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు దౌర్జన్యం చేయడంతో పాటు కులం పేరుతో దూషించారని సోమవారం కలెక్టరేట్‌లో, ఎస్పీకి మీ కోసంలో ఫిర్యాదు చేసినట్లు చినపాండ్రాక సర్పంచ్ కొండ్రు బాయమ్మ తెలిపారు. పంచాయతీలో కొబ్బరిచెట్లు పాట సొమ్ము బకాయి చెల్లించాలని నోటీస్ ఇవ్వడంతో రామ్మూర్తినాయుడు, పంచాయతీ తరపున క్లాప్‌మిత్రగా ఉన్న మూర్తి ఖాతాలో గతంలో డిపాజిట్ చేసిన సొమ్మును పంచాయతీకి జమచేయాల్సిందిగా కోరితే తనపై దౌర్జన్యానికి వచ్చినట్లు ఫిర్యాదు చేశామని తెలిపారు. సర్పంచ్‌నైన తనపై కనీసం గౌరవం లేకుండా, మహిళనని కూడా చూడకుండా దౌర్జన్యానికి పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు.

రూ.3.23 కోట్ల పెన్షన్ నిధులు విడుదల

కోడూరు: మండలంలోని 13 పంచాయతీలకు సంబంధించి ఆగష్టు నెలలో 7,351 మంది పెన్షన్‌దారులకు రూ.3.23 కోట్ల నగదును పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ ఆర్.శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. వృద్ధాప్య, వితంతు, డప్పు కళాకారులు, ఒంటరి మహిళలకు సంబంధించి 5,330 మందికి గాను రూ.2.13 కోట్లు, 1,476 మంది దివ్యాంగులకు రూ.88 లక్షలు, వైద్య ఖర్చుల నిమిత్తం 77 మందికి రూ.15 వేలు చొప్పున రూ.11.46 లక్షలు, వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడే ఐదుగురికి రూ.10 వేల చొప్పున రూ.50 వేలు, అమరావతి పెన్షన్ ఒకరికి రూ.5 వేలు, 240 మందికి అభయహస్తం కింద రూ.1.20 లక్షలు, 178 మందికి కల్లుగీత పెన్షన్ల కింద రూ.7.12 లక్షలు, 41 మందికి చేనేత పెన్షన్ల ద్వారా రూ.1.64 లక్షలు, ముగ్గురికి కాబ్లర్స్ పెన్షన్ల కింద రూ.12 వేల నగదును అందించనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. ఒకటో తేదీన ఉదయం 5గంటల నుంచే పెన్షన్ల పంపిణీ ప్రారంభమవుతుందని, 107 సచివాలయ సిబ్బంది ఈ పంపిణీలో పాల్గొంటారని తెలిపారు. పెన్షన్‌దారులు సిబ్బందికి సహకరించాలని ఎంపీడీఓ కోరారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి కావడి సేవ



జానకీరాంపురంలో కావడితో భక్తులు



కావడిసేవలో పాల్గొన్న భక్తులు

బంటుమిల్లి: మండల పరిధిలోని జానకీరామపురం గ్రామంలో శ్రీ వల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో మంగళవారం కావడి ఉత్సవం భక్తి, శ్రద్ధలతో నిర్వహించారు. స్వామి జన్మ నక్షత్రం కృత్తికను పురస్కరించుకుని ఆలయ ట్రస్టీ గంగిశెట్టి దేవానంద్ పర్యవేక్షణలో పలువురు దంపతులు బంటుమిల్లి శివాలయం నుంచి మేళ, తాళాలతో స్వామివారి పూజ ద్రవ్యాలను బిందెల్లో ఉంచుకుని కావడిలలో మోసుకుంటూ హర హర మహాదేవ అంటూ భగవన్నామ స్మరణ చేస్తూ సుబ్రహ్మణ్యస్వామి గుడికి చేరుకున్నారు. అనంతరం పండితుల వేద మంత్రాల మధ్య స్వామి ప్రధాన మూర్తులకు మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవార్లకు కుంకుమ పూజలు నిర్వహించారు. పలు గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

మచిలీపట్నంటౌన్: శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారికి భక్తులు మంగళవారం కావడిసేవ అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక ఆజాద్‌రోడ్డులోని శ్రీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం నుంచి దాదాపు 600 మంది భక్తులు అలంకరించిన కావడిలను భుజాన పెట్టుకుని కోనేరుసెంటర్ మీదుగా ప్రధాన రహదారిలో ముందుకు సాగారు. రాజా గారి సెంటర్, రేవతి సెంటరు, జిల్లా కోర్టు సెంటర్, లక్ష్మీటాకీసు సెంటరు మీదుగా జిల్లా పరిషత్ సెంటరు వరకు కావడిసేవ నిర్వహించారు. వీరంతా మేకవానిపాలెంలోని సుబ్రహ్మణ్యస్వామి దేవస్థానానికి చేరుకుని స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

దరఖాస్తుల ఆహ్వానం

అవనిగడ్డ: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో 2024-25 విద్యాసంవత్సరానికి డిగ్రీలో పలు కోర్సులు ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.ఉమారాణి తెలిపారు. డిగ్రీలో బీఏ, బీకాం, బీఎస్సీ, యూజీ కోర్సులకు నూతన ప్రవేశం, ద్వితీయ, తృతీయ సంవత్సరానికి ప్రవేశం పొందవచ్చని చెప్పారు. ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్ చదివిన వారు అర్హులన్నారు. ఆగస్టు 18వ తేదీతో ప్రవేశానికి చివరి తేదీ అని, ఆసక్తి ఉన్నవారు సహాయ కేంద్రం 73829 29812, జూనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ 94401 76821, ఆఫీస్ అసిస్టెంట్ ఆదినారాయణ 90004 36731 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఉపాధి అవకాశాలు పెంచేలా ప్రణాళిక ఉండాలి

జేసీ గీతాంజలిశర్మ

చిలకలపూడి(మచిలీపట్నం): నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు పెంచే విధంగా నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రణాళిక రూపొందించాలని జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని ఆమెచాంబర్ నుంచి వర్చువల్ విధానంలో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నిరుద్యోగ యువత వారు కోరుకుంటున్న రంగంలో నైపుణ్యాలను పెంపొందించి ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. జిల్లాలో స్కిల్ సెన్సెస్ నిర్వహించి పదో తరగతి, ఇంటర్మీడియెట్ తదితర విద్యార్హతలు ఉన్న వారిని గుర్తించి నైపుణ్య శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పరిశ్రమలు, వ్యాపార సంస్థలను సంప్రదించి, వారి అవసరాలకు అనుగుణంగా డిమాండ్ ఉన్న కోర్సులను గుర్తించి, నిరుద్యోగులకు శిక్షణ ఇప్పించి ఉద్యోగాలు వచ్చేలా చర్యలు తీసుకున్నారన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎన్.శ్రీనివాసరావు, డీఆర్డీఏ ఇన్‌చార్జ్ పీడీ నాగేశ్వరనాయక్, జిల్లా పరిశ్రమల అధికారి ఆర్. వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీని సందర్శించిన ఎమ్మెల్యే



వైద్యాధికారి ఇంద్రకుమార్ నుంచి వివరాలు తెలుసుకుంటున్న బుద్ధప్రసాద్

నాగాయలంక: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిని పరిశీలించి రోగులను కలసి వైద్యం అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. వైద్యాధికారులతో మాట్లాడి మందుల స్టాక్, వైద్య పరికరాలు అవసరమైన స్థాయిలో అందుబాటులో ఉన్నాయా లేదా అని ప్రశ్నించారు. పాటుకాటు చికిత్సకు అవసరమైన ఇంజెక్షన్‌లు పూర్తి అందుబాటులో సిద్ధంగా ఉన్నాయని డాక్టర్ ఇంద్రకుమార్ రెడ్డి వివరించారు. రోగులకు మరింత మెరుగైన వైద్యం అందించేందుకు అనువుగా ఆసుపత్రి అభివృద్ధి, అవసరమైన నూతన పరికరాలు, సిబ్బంది భర్తీ ప్రతిపాదనలు సిద్ధం చేసి తనకు నివేదిక ఇవ్వాలని పీహెచ్‌సీ వర్గాలను ఆదేశించారు. ఆయన వెంట అవనిగడ్డ మండల జనసేన అధ్యక్షుడు గుడివాక శేషుబాబు ఉన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థినికి నగదు బహుమతి



విద్యార్థిని గ్రీష్మంత్ మహికి నగదును అందజేస్తున్న హైమావతి

పెడన: పట్టణంలోని తోటమూల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత ఏడాది పదో తరగతిలో మండల స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని యార్లగడ్డ గ్రీష్మంత్ మహికి భట్ట హైమావతి రూ.5 వేలను పారితోషికం కింద అందజేశారు. 2024-25 పదో తరగతిలో పెడన మండల స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల విభాగంలో ప్రథమ స్థానం సాధించి నూజివీడు ట్రిపుల్ ఐటీలో గ్రీష్మంత్ మహి ప్రవేశం పొందిందని పాఠశాల స్థలదాత భట్ట హైమావతి నగదును అందజేసి అభినందించారు. పదో తరగతిలో 581 సాధించడమే కాదని, ట్రిపుల్ ఐటీలో కూడా బాగా చదువుకుని తోటమూల భట్ట మోహన్‌రావు హైమావతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మంచి పేరు తేవాలని, మీ గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలను తీసుకురావాలని ఆమె ఆకాంక్షించారు. అత్యధిక మార్కులు వచ్చేలా పిల్లలను తీర్చిదిద్దిన పాఠశాల హెచ్‌ఎం చింతలపాటి నాగేశ్వరరావు, ఇతర ఉపాధ్యాయులను ఆమె అభినందించారు.

కుండ పోత వర్షం.. లోతట్టు ప్రాంతాలు జలమయం



పెడన-మచిలీపట్నం ప్రధాన రహదారిపై వర్షం నీటిలో ద్విచక్రవాహనదారుల ఇక్కట్లు

పెడన: పెడనలో కుండపోత వర్షం పడింది. మంగళవారం మధ్యాహ్నం వర్షం కుమ్మరించడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధాన రహదారిలోని మహాత్మగాంధీ మున్సిపల్ కాంప్లెక్స్, మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న ప్రధాన రహదారితో పాటు రైల్వే స్టేషన్ రోడ్డు, రామలక్ష్మీవీవర్స్ కాలనీలలోని అంతర్గతర రహదారులు నీటమునిగాయి. వీటి పక్కనే ఉండే కచ్చా డ్రెయిన్లలో మురుగునీరు, వర్షం నీరు కలిసి రోడ్లపై ప్రవహించాయి. ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

ఆయిల్ పాం సాగుపై అవగాహన సదస్సు

నాగాయితిప్ప(మోపిదేవి): ప్రభుత్వం ఆయిల్ పాం సాగును ప్రోత్సహిస్తుందని, ఈ సాగును రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఉద్యాన అధికారి ఎన్.రమేష్ సూచించారు. మండల పరిధిలోని నాగాయితిప్ప పంచాయతీ వద్ద గ్రామ సర్పంచ్ గరికిపాటి వెంకటేశ్వరావు, మోపిదేవి లంక సర్పంచ్ మోర్ల జోత్స్న అధ్యక్షతన ఆయిల్ పాం సాగుపై రైతులకు అవగాహన సదస్సు మంగళవారం సాయంత్రం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఒక హెక్టారుకు 143 మొక్కలు వేసుకోవాలని దేశవాళీ మొక్కలకు రూ.20 వేలు, విదేశీ మొక్కలకు రూ.29 వేలు ప్రభుత్వం సబ్సిడీ అందించనున్నట్లు తెలిపారు. తోటల యాజమాని ఒక సంవత్సరం రూ.5,250 చొప్పున 4 సంవత్సరాలల్లో రూ.21 వేలు లాభం సాధించవచ్చని చెప్పారు. అంతర పంటలుగా పసుపు, కూరగాయలు, పూలతోటలు పెంచుకోవచ్చన్నారు. చాఫ్ కట్టర్‌కు 50 శాతం సబ్సిడీ ఉందని, డ్రిప్పు పెట్టుకోవాలంటే సబ్సిడీ లభిస్తుందని తెలిపారు. ఆయిల్ కంపెనీ ప్రతినిధి, గ్రామ వ్యవసాయ సహాయకులు, పలువురు రైతులు పాల్గొన్నారు.

బాలికల హాస్టల్‌లో ఆకస్మిక తనిఖీలు

శ్రీకాకుళం(ఘంటసాల): మండలంలోని శ్రీకాకుళం లో ప్రభుత్వ సాంఘిక సంక్షేమశాఖ బాలికల వసతి గృహాన్ని ఎంపీడీవో మారుతీ శేషమాంబ మంగళవారం సాయంత్రం ఆకస్మిక తనిఖీ చేశారు. హాస్టల్ పరిసరాలను, సౌకర్యాలను, వంట గదిని, డైనింగ్ హాల్‌ను ఎంపీడీవో పరిశీలించడంతో పాటు భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. హాస్టల్లో డ్రెయినేజీ అభివృద్ధి చేయాలని కోరగా పనులు ప్రారంభించేలా చూస్తానని హామీ ఇచ్చారు. మండల పరిషత్ ఏవో కేజే శ్రీనివాస చంద్, తెలుగురావుపాలెం సర్పంచ్ రాచూరి ప్రసాద్ బాబు, హాస్టల్ సిబ్బంది మరియమ్మ, సుధ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

ఘంటసాల: స్థానిక ఎస్టీ కాలనీలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన అగ్ని ప్రమాదంలో నాలుగు పూరిళ్లుదగ్ధం కాగా బాధితులను యువనేత వెంకట్రామ్, టీడీపీ మండల అధ్యక్షుడు తుమ్మల చౌదరిబాబుతో కలసి మంగళవారం పరామర్శించారు. బాధితులైన అమృత నాంచారమ్మ, అమృత బుజ్జమ్మ, అమృత వెంకమ్మ, అమృత ఏసు కుటుంబాలకు వెంకట్రామ్ రూ.2,500 నగదు, దుప్పట్లు, వస్త్రాలు అందించారు. చౌదరి బాబు రూ.2,500 ఆర్థిక సాయాన్ని అందజేశారు. టీడీపీ నేతలు గొర్రెపాటి శ్రీను, వేమూరి రమేష్, జనసేన నేతలు పాల్గొన్నారు.

బాధితులకు బియ్యం పంపిణీ

ఘంటసాల: ఘంటసాల ఎస్టీ కాలనీలో అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన నాలుగు కుటుంబాల వారిని ప్రజా ప్రతినిధులు, అధికారులు మంగళవారం పరామర్శించారు. బాధితులను సర్పంచ్ బి.వెంకటేశ్వరమ్మ, ఇన్‌చార్జి తహసీల్దార్ సీహెచ్.చిట్టిబాబు, ఎంపీడీవో బి.మారుతీ శేషమాంబలు పరామర్శించారు. ఉన్నతాధికారులతో మాట్లాడి తమవంతు సాయం అందిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. రెవెన్యూ శాఖ తరుపున ఒక్కో కుటుంబానికి 13 కేజీల బియ్యం అందించగా సర్పంచి వెంకటేశ్వరమ్మ చేతుల మీదగా పంపిణీ చేశారు. మండల పరిషత్ ఏవో కేజేఎస్ చంద్, వీఆర్వోలు నాగేశ్వరరావు, గిరి ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కౌన్సిల్ అత్యవసర సమావేశం

పెడన: పురపాలక సంఘం కౌన్సిల్ అత్యవసర సమావేశాన్ని ఈ నెల 31న ఉదయం 11 గంటలకు ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో అజెండాలోని 23 అంశాలపై చర్చ, ఆమోదం గురించి ఈ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, సంబంధిత విభాగాలకు చెందిన అధికారులు, మున్సిపల్ అధికారులు తప్పనిసరిగా హాజరుకావాల్సిందిగా ఆమె పేర్కొన్నారు.

వైభవంగా కార్తికేయుని దివ్య కల్యాణం

మోపిదేవి: స్థానిక మోపిదేవి శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దివ్య కల్యాణ మహోత్సవం మంగళవారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ ప్రధానార్చకులు బుద్ధు పవన్‌కుమార్‌శర్మ, వేదపండితులు కొమ్మూరి ఫణికుమార్ శర్మ ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పవిత్రోత్సవాల్లో భాగంగా స్వామివారి జన్మనక్షత్రం ఆషాఢ ఆడకృత్తిక సందర్భంగా మహాన్యాసపూర్వక రుద్రాభిషేకములు, అష్టోత్తర కలశాభిషేకము, లక్షబిల్వార్చన, శాంతి కల్యాణం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్ని స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పెన్షన్ల పంపిణీకి పర్యవేక్షణ కమిటీలు

ఘంటసాల: పెన్షన్లు పంపిణీపై మండల, సచివాలయాల స్థాయి పర్యవేక్షణ కమిటీలను మంగళవారం ఏర్పాటు చేశారు. మండల స్థాయి కమిటీలో ఎంపీడీవో మారుతీ శేషమాంబ, తహసీల్దార్ సీహెచ్.చిట్టిబాబు, మండల పరిషత్ ఏవో కేజే శ్రీనివాస్ చంద్‌లను నియమించారు. గ్రామ కమిటీలతో ఎంపీడీవో సమావేశం నిర్వహించారు.కమిటీసభ్యులు,పంచాయతీ, కార్యదర్శులు పాల్గొన్నారు.